లోకాయుక్త,ఉప లోకాయుక్తల ప్రమాణం




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

అధికారం పోయినా అహంకారం తగ్గలేదు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 121 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 29 ఏప్రిల్ 2025




●నేను సిఎం అయిన రెండోరోజే గుండెపగిలిన కెసిఆర్ ●అక్కసు వెళ్లగక్కేలా కెసిఆర్ ఎల్కతుర్తి ప్రసంగం ●ఎమ్మెల్యేలదే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ●నమ్ముకున్న వారికే పదువులు వస్తాయి జానారెడ్డి నివాసంలో సిఎం రేవంత్ చర్చలు

# బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

**హైదరాబాద్,28(పీసీడబ్ల్యూ న్యూస్):** తాను సీఎం అయినా రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో గులాబీ బాస్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రసంగంలో పసలేదని.. ప్రభుత్వంపై ఆయన అక్కసంతా వెళ్లగక్కారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లలో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఎన్ని చెప్పినా.. బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారన్నారు. కేసీఆర్ ప్రసంగంలో స్పష్టతే లేదన్నారు. మా పిల్లలనే అసెంబ్లీలో ఎదుర్కొలేక పోతున్నారని కేసీఆర్ అంటున్నారు.. వాళ్ళు పిల్లలు అని తెలిశాక మరీ అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. మేం కక్ష సాధింపు చర్యలకు దిగమని.. తాను ఇంకో 20 ఏండ్లు రాజకీయాల్లో ఉంటానని తెలిపారు. కేటీఆర్ కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా చట్టపరంగానే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా చట్టానికి వ్యతిరేకంగా కేసులు పెట్టి జైల్లో వేయించమన్నారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులపై డిమాండ్లు వస్తున్నాయని.. కానీ వివరాలు 2లో

## ఎన్‌డిఏ రాజ్యసభ అభ్యర్థిగా పాకా



☛ఖరారు చేసిన బిజెపి అధిష్టానం

**అమరావతి,28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. మందకృష్ణ పేరు ఖరారు అవుతుందన్న ఊహాగానాలకు తెరదించారు. ఎన్డీయే అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారా యణను అధిష్ఠానం ప్రకటించింది. ఆయన ప్రస్తుతం ఏపీ భాజపా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయ్యింది. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్న నేపథ్యంలో ఉపఎన్నికకు ఎన్నికల సంఘం ఇటీ–వల నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో.. భాజపా ఏపీ కోర్ కమిటీ– సమావేశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి యూరప్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. పాకా వెంకట సత్యనారాయణవైపు మొగ్గు చూపిన పార్టీ అధిష్ఠానం ..ఆయన్ని అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వెంటాడుతాం: కెటిఆర్

**హైదరాబాద్,28(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. వరంగల్ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలకు చెప్పిన సందేశం ఇదేనని పేర్కొన్నారు. వివరాలు 2లో



## సిఎం రేవంత్‌ను కలిసిన కొత్త సిఎస్

☛హెచ్ఆర్‌డి వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి



**హైదరాబాద్,28(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ– జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు– ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని వివరాలు 2లో



ప్రజలను మభ్య పెట్టే యత్నంలో

## కెసిఆర్

- తెలంగాణకు ఏం చేశారో చెప్పలేని స్థితి
- బిఆర్ఎస్ మరింత పతనం ఖాయమన్న బండి

**హైదరాబాద్,28(పీసీడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ వజ్రోత్సవ సభవల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని, గెలుస్తామని ప్రకటించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప మరోటి లేదన్నారు. వివరాలు 2లో

## బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

☛ఎక్కడా కానరాని మహిళలు☛కెసిఆర్ వ్యాఖ్యలపై చర్చకు సిద్దం
☛టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,28(పీసీడబ్ల్యూ న్యూస్):**బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని.. తెలంగాణ ఫస్ట్ అండ్ చివరి విలన్ కేసీఆర్ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన,15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధమన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. టైం, వేదిక మీరే డిసైడ్ చేయండి.. చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తా? ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్? అంటూ సవాల్ విసిరారు. రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయని.. వివరాలు 2లో



## పద్మ భూషణ్ అందుకున్న బాలకృష్ణ

☛ రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా స్వీకరణ

**న్యూఢిల్లీ,28(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారం అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో వివరాలు 2లో

## బిఆర్ఎస్ రజోత్సవ సభ.. ఉత్తుత్తి.. సభ!

● సీతారాంపురం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆకుల మోహన్● సీతారాంపురం 8వ వార్డు ప్రధాన కార్యదర్శి జంగిల్ సతీష్

**పరకాల, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 27న ఎలుకతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ రజోత్సవ సభ.. అంత ఉత్తుత్తి సబే, డబ్బాసారం అని, సభ సక్సెస్ అయిందని, బిఆర్ఎస్ నాయకులు డబ్బాలు కొట్టుకునుడే సరిపోయిందని సీతారాంపురం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆకుల మోహన్, సీతారాంపురం 8వ వార్డు ప్రధాన కార్యదర్శి జంగిల్ సతీష్ ఒక సంయుక్త ప్రకటన లో ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాలు ప్రవేశపెడుతూ, ఫలాలు అందరికీ అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు వెళ్తుందని, మరో ఐదేళ్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రజా ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేని బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్, బిఆర్ఎస్ నాయకులు సభ పెట్టే ప్రయత్నం చేసి, ప్రజల ముందు తేలిపోయారన్నారు. డబ్బు, సారాయి పంచి సభకు రప్పించుకున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో.. పరకాల రేవూరి ప్రకాష్ రెడ్డి పరకాల నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తున్నారని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రజలకు చేరవేస్తామన్నారు. రాబోయే రోజుల్లో, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను నలు దిశల చాటి, కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుదామన్నారు.





## రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వెంటాడుతాం: కెటిఆర్

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలో అతి పెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుందని ప్రశంసించారు. వరంగల్ బిఆర్ఎస్ సభ అనేది రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమేనని, ఇకపై తానే ముందుండి పోరాడుతానని కెసిఆర్ ప్రకటించారని, భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రతి అంశంలో ప్రభుత్వాన్ని వెంటాడుతామని కెటిఆర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆరాచకాలను మరింతగా ఎండగడతామన్నారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన కొత్త సిఎస్

(మొదటి పేజీ తరువాయి)

1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో రామకృష్ణారావు సోమవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం ఆయనను అభినందించారు. ఇదిలావుంటే పదవీవిరమణ చేస్తున్న సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యత అప్పగించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) వైస్ ఛైర్‌పర్సన్ గా శాంతి కుమారి పేరును ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ పదవి విరమణ తర్వాత.. ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

## పద్మ భూషణ్ అందుకున్న బాలకృష్ణ

(మొదటి పేజీ తరువాయి)

పద్మ అవార్డుల వేడుక జరిగింది. గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. 2025 సంవత్సరానికి గాను పద్మ పురస్కారాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం పద్మ పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది.భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పలు రంగాల్లో విశేష కృషిని అందించిన కళాకారులు అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమ నుండి హీరో నందమూరి బాలకృష్ణకి కేంద్రం పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో బాలకృష్ణ'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. ఢిల్లీలోని మాన్‌సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్‌కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏ-కై-క అగ్ర నటు-డిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎంతో మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రకటించింది.

## లోకాయుక్త,ఉప లోకాయుక్తల ప్రమాణం

● రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

**హైదరాబాద్,ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ లో లోకాయుక్త , ఉపలోకాయుక్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి , ఉపలోకాయుక్తగా బి.ఎస్.జగ్జీవన్ కుమార్ సోమవారం నాడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ముఖ్యమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , పలువురు ప్రముఖులు హాజరయ్యారు.జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి ,బి.ఎస్.జగ్జీవన్ కుమార్లు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హాజరైన వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి నియామకం రాష్ట్ర పాలనలో మరింత పారదర్శకత , జవాబుదారీతనాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా పరిగణించబడుతోంది. లోకాయుక్త , ఉపలోకాయుక్తల నియామకంతో ప్రజలు తమ సమస్యలను, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించే ఒక ఉన్నత స్థాయి వేదికను ఆశించవచ్చు.



## బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

(మొదటి పేజీ తరువాయి)

చట్టప్రకారమే నడుచుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పథకాల ప్లానింగ్ కే సరిపోయిందని.. ఇకపై పథకాల గ్రౌండింగ్ పై ఫోకస్ పెడతామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా లాంఛింగ్.. క్లోజింగ్ స్కీములు ఉండవని.. ఏదైనా ఒక పథకం ప్రారంభిస్తే అర్హులకు అందేవరకు పని చేస్తానని అన్నారు. రేవంత్ రెడ్డి చెప్పింది చేస్తాడు అనే నమ్మకం కలిగేలా పని చేస్తానని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. 'కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని రేవంత్ హెచ్చరించారు. కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చినప్పటికీ, గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ కేసుల గురించి రేవంత్ మాట్లాడుతూ.. చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించను అని ఆయన అన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని విమర్శించారు. కొంత మంది అధికారుల పని తీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. నన్ను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదని అన్నారు.ఈ సందర్భంగా మావోయిస్టుల అంశంపై జానారెడ్డితో చర్చ జరిగినట్లు చెప్పారు. గతంలో మావోయిస్టులతో చర్చలు నిర్వహించిన అనుభవం జానారెడ్డి, కేకేలకు దగ్గర ఉందని, ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు అధిష్టానం నిర్ణయాన్ని ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. పార్టీ హైకమాండ్ కు సమాచారం ఇచ్చి, పీస్ కమిటీ రిక్వెస్ట్ పంపిస్తామని తెలిపారు. జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

## ప్రజలను మభ్య పెట్టే యత్నంలో కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

కేవలం మభ్య పెట్టే యత్నాల్లో కెసిఆర్ ఉన్నారని విమర్శించారు. బిఆర్ఎస్ తన పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయలేదో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశానికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాకపోతే.. అంతర్జాతీయ రాష్ట్ర సమితి పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే వజ్రోత్సవ సభ నిర్వహించిందని సంజయ్ విమర్శించారు. 9ఏళ్ల పాలనలో తెరాస ఏం చేసిందో, భవిష్యత్తులో ఏం చేయబోతుందో చెప్పకుండా భాజపా లక్ష్యంగానే సమావేశాలు నడిచాయని అన్నారు. రాష్ట్రంలో తెరాస పతనం మరింత ప్రారంభమైందని అభిప్రాయపడ్డారు. ఆ తీర్మానాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసిన కేసీయార్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసిందినిజం కాదా అని ప్రశ్నించారు. మోడీ విధానాల్ని ఇతర దేశాల అధినేతలు ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ, సహారా కుంభకోణాలు వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. భాజపా మతతత్వ పార్టీ అన్న కేసీఆర్ విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. దేశానికే ఎంఐఎం పార్టీ క్యాన్సర్ లాంటిదని, అలాంటి క్యాన్సర్ గొంతులో వేసుకున్నది కెసిర్ అని ఎదురుదాడికి దిగారు. ఎంఐఎం మతపార్టీ కాదా అని ప్రశ్నించారు. అవకాశమిస్తే కేసీఆర్ ముస్లింలకు 20శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్–తెరాస ఒకటేనన్న సంజయ్.. కాదని చెప్పినా జనం నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. భాజపాను ఒంటరిగా ఎదుర్కోలేక భాజపాయేతర పక్షాలు ఒక్కటవుతున్నాయని, ఎన్ని కూటములు ఏర్పడినా..తెలంగాణలో తదుపరి భాజపాదే అధికారమని స్పష్టం చేశారు. మహిళా గవర్నర్‌కు రాష్ట్రంలో కనీస గౌరవం దక్కడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందాయని, అవార్డులు పొందాయని గుర్తు చేశారు. లక్షల కోట్ల అప్పులున్న తెలంగాణ ధనిక రాష్ట్రమా. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కేసీఆర్‌కుటుంబం సంపాదించుకుందని బండి సంజయ్ విమర్శించారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

(మొదటి పేజీ తరువాయి)

సభలో అసలు మహిళలే కనిపించడం లేదన్నారు. వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగంలో పసలేదు.. ఆయన శకం ముగిసిందని వ్యాఖ్యానించారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని.. నకిలీ గాంధీలు అనడం కేసీఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని మండిపడ్డారు.. కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీజేపీ – బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అనడానికి నిదర్శనం బీజేపీపై కేసీఆర్ రెండు నిమిషాల ప్రసంగమని ఆరోపించారు. బీజేపీపై కేసీఆర్ విమర్శలు నెమలి పింఛంతో కొట్టినట్లు– ఉందని.. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ బిక్షతో ముఖ్యమంత్రి అయ్యావు అంటూ కేసీఆర్‌ను విమర్శించారు. గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ భిక్షతో దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కేసిఆర్ కి వెన్నతో పెట్టిన విద్య. పదేళ్లలో మీరు 60 వేల ఉద్యోగాలు ఇస్తే. మేము ఏడాదిలో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కేసిఆర్ కి గుండెల్లో గుబులు మొదలైంది. కేటీఆర్, హరీష్ రావు, కవిత ఆడుతున్న మూడు ముక్కల ఆటతో కేసీఆర్‌కి మతి భ్రమించిందని బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు.

## అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

● కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి



**గజ్వేల్,ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** అధికారం కోల్పోయినా కెసిఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపు నిండా విషం నింపుకొని..మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం, శాకారం టిజిఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయనతోపాటు– మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియా గాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్.. కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్‌ను విలన్‌గా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన కెసిఆర్ కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కెసిఆర్ సొంత పార్టీ ఎంఎల్ఎలను కూడా కలిసేందుకు ఒప్పుకోలేదని వ్యాఖ్యానించారు. ఇపుడు తగుదునమ్మా అంటూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేందుకే తాము భూ భారతి చట్టం తీసుకువచ్చామని, తమ అక్రమాలు బయటపడతాయనే బిఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. తాము రైతులకురూ.2 లక్షల రుణమాఫీ చేసినందుకా, మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నందుకా, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నందుకా, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకా, మీ ఏడుపులు, పెడబొబ్బలు అంటూ కెసిఆర్ ను ప్రశ్నించారు. రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లక్ష్యయంగా పెట్టు–కోగా, గజ్వేల్ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయిస్తున్నట్లు– తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనూ చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎంఎల్ఎ నాయిని రాజేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ– అధ్యక్షుడు తుకుంట నర్సారెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, నాయకుడు భూమ్ రెడ్డి ఎలక్షన్ రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ– ఛైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డిఓ చంద్రకళ, తహసిల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇచ్చిన సోనియాను దేవత అనలేదా

● తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని ఎలా అంటారు

● అక్రమంగా పదిలక్షల కోట్లు సంపాదించిన కెసిఆర్

● కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు ఉత్తమ్,కోమటిరెడ్డి

**నల్గొండ,ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ నే విమర్శిస్తావా అని కేసీఆర్ తీరును మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కమార్ రెడ్డిలు ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో 10 వేల అబద్దాలు ఆడారని వారు విర్శించారు. ఏ మోహం పెట్టుకుని కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ దేవత అని కేసీఆర్ గతంలో అనలేదా అని ప్రశ్నించారు. సోనియా కాళ్లు మొక్కిన వ్యక్తి కేసీఆర్ అని కోమటిరెడ్డి అన్నారు. పదేండ్లలో కేసీఆర్ అక్రమంగా 10 లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు జైల్లో ఉంటే మరి కొందరు అమెరికాలో ఉన్నారని విమర్శించారు. తాము అబద్దాలు చెప్పి ఉంటే ఎప్పుడో అధికారం లోకి వచ్చే వాళ్లమన్నారు. మేం తల్చుకుంటే బీఆర్ఎస్ కంటే తలదన్నే మీటింగ్ పెట్టగలమన్నారు. తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు– దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మరో దశాబ్ధం నల్గొండ కాంగ్రెస్ దేనన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీపడబోమన్నారు. నల్గొండకు రూ. 700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామనిచెప్పారు ఉత్తమ్. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు– కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటు–ప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్–2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమిషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు– ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోందని ఉత్తమ్ అన్నారు.



## 25వ రజతోత్సవ సభ విజయవంతం... సంబురాలు జరుపుకున్న బిఆర్ఎస్ నాయకులు




**హనుమకొండ, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** 25వ బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని, సోమవారం కాజీపేట చౌరస్తాలో 47వ డివిజన్ అధ్యక్షులు దువ్వ కనకరాజు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు టపాసులు పేల్చుతూ.., స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు బి.ఆర్.ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్ పాల్గొని మాట్లాడుతూ.. 25వ రజోత్సవ సభ సక్సెస్ చేసిన అన్ని వర్గాల ప్రజలకు బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తూ.., కెసిఆర్ ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రపంచమే అబ్బురపరిచే విధంగా సభలు సమావేశాలు పెట్టడంలో దీటైన నాయకుడు కేసీఆర్ కొంతమంది చీడపురుగు లాంటి నాయకులు కాంగ్రెస్ దద్దమ్మలు మీటింగ్ పై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకునే నాయకులారా ఖబర్దార్! ఇప్పుడైనా కేసీఆర్ గురించి తెలుసుకోండి, కేసీఆర్ అంటేనే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం తెలంగాణ స్త్రీమూర్తులు అంటే కేసీఆర్ కు ఒక తల్లి ఒక చెల్లి తోబుట్టు లాగా చూసుకునే కేసీఆర్ కోసం ఒక్క స్త్రీ రాలేదని అంటారా వారు ఎండ తాకిడికి వారి ఆరోగ్యం కాపాడుకోవాలని సభ ఏర్పాట్లకు ముందే స్త్రీమూర్తులందరికీ తెలియజేశామని, మీలాగా మీలాంటి ఆరు బోగస్ గ్యారంటీల్లా మీ లాగా దొంగ హామీలు లాగా ఏనాడూ మాట్లాడలేదని విమర్శించారు. ఇప్పటికైనా రజతోత్సవ సభను చూసుకొని కళ్ళు మండేలా కాకుండా తెలంగాణ ప్రజల గొంతు నిండేలా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్, 62వ డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, సిరిమల్ల దశరథం, నయీమ్ జుబేర్, కొంద్ర శంకర్, తండమల్ల వేణు, మరియాల కృష్ణ, బరిగల వినయ్, ఎస్.కె మహమూద్ మతిన్, ఇమ్మడి రవి, సందీప్, గాజుల విజయ్, దూపెల్లి శివ, మండల సుబ్బు సంకు రేవంత్ పోతుల సాంబయ్య పడిదల శేఖర్ బండి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**హనుమకొండ, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):**హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన హన్మకొండ, వరంగల్ జిల్లాల పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది అని తెలిపారు. అలాగే పార్టీ బలంగా ఉంటేనే కార్యకర్తలు బలంగా ఉంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తల కష్టంతోనే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. నాయకులైనా, కార్యకర్తలైనా పార్టీని ఇబ్బంది పెట్టేవిధంగా వ్యవహరించకూదని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో, కమిటీల ఏర్పాటులో పై స్థాయి నుండి కింది స్థాయికి రావడం సరైంది కాదని, గ్రామ స్థాయి నుండి పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. అప్పుడే సరైన నాయకత్వానికి అవకాశం లభిస్తుందని అన్నారు. సిఫార్సుల ద్వారా, నామినేటెడ్ గా పదవులు ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమక్షంలో సమావేశాలు నిర్వహించి అర్హతను బట్టి పదవులు కేటాయించాలని తెలిపారు. కమిటీల ఏర్పాటుకు ఒక నియమావళిని రూపొందించి దానికి అనుగుణంగా కమిటీల ఏర్పాటు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పిసిసి పరిశీలకులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఆఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు ఎన్నికైన పూర్ణాచారి, రవీంద్ర చారి...



**కరీంనగర్ జిల్లా,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఆదివారం జరిగిన అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షులు యశ్పాల్ చౌహన్ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పధాధికారులచే ప్రమాణ స్వీకారమహోత్సవం లో స్వర్ణకార సంఘం సౌత్ ఇండియా ఇన్చార్జి జల్లపల్లి పెంటయ్య చారి సమక్షంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి ప్రతిపాదనలో ఉమ్మడి జిల్లా నుండి బ్రహ్మశ్రీ కందుకూరి పూర్ణాచారి జాయింట్ సెక్రెటరీ గా, బ్రహ్మశ్రీ శ్రీరామోజు రవీంద్ర చారి జాతీయ మెంబర్ గా ఎన్నికయ్యారు. వీరందరికీ నియమాక పత్రం అందించి , ప్రమాణస్వీకారం చేయించడం జరిగిందని ఇంచార్జి పెంటయ్యా చారి తెలిపారు.వీరి ఎంపిక పట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్వర్ణకార సంఘ బాధ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

- పహల్గామ్ నరమేధం అత్యంత దారుణం- హంతకులను శిక్షించాలి, హతులకు న్యాయం జరగాలి
- స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్-తెలంగాణ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖలు




**హనుమకొండ, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** పహాల్గామ్ లోని బైసారమ్ లో 28 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాద చర్యను నిరసిస్తూ.. హనుమకొండ జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించ తలపెట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి వీరాస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్ లు అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం సోమవారం ఉదయం అసోసియేషన్ కార్యాలయంలో జరుగగా.., అందుబాటులో వున్న 60 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి వీరాస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య లతో హాజరైన సభ్యులందరూ ఉగ్రవాద చర్య అత్యంత హీనమైనదని పెన్షనర్ల అసోసియేట్ తీవ్రంగా ముక్త కంఠం తో ఖండించారు. ఈ సందర్భంగా ఇ నరసింహా రెడ్డి, తుమ్మ వీరయ్య లు మాట్లాడుతూ.. మన దేశంలో సమూహాల మధ్య నెలకొని వున్న సామూహిక శాంతి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సామాజిక వర్గాల మధ్య ఐకమత్యం మీద భీకరమైన దాడి అని పేర్కొన్నారు. జి వీరాస్వామి, వెలిశోజు రామ మనోహర్‌లు మాట్లాడుతూ.. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి ఆనందించడానికి వివిధ ప్రదేశాల నుండి వచ్చిన పర్యాటకులను గురి చూసి తూటాలు పేల్చడం ఉగ్రవాదుల కృరీర మనస్తత్వాన్ని తెలియ పరుస్తుందని, పహాల్గాం నరమేధం అత్యంత దారుణమని విచారం వ్యక్తం చేశారు. మదార్ సాహెబ్, మహేందర్, కె రమేష్, యన్ కిష్టయ్య, బి ఆగయ్య, శ్యామ్ సుందర్ రెడ్డి, సత్తయ్య, సుకుమార్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ఈ దారుణానికి పాల్పడ్డ వారిని,వారి వెనుక వున్న దుష్ట శక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అశువులు బాసిన పర్యాటకులకు అశ్రు నివాళు లు అర్పిస్తూ నేడు (మంగళవారం) సాయంత్రం 7 గం లకు అసోసియేషన్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో హనుమకొండ, వరంగల్ రెండు జిల్లాల నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీని, నాయకత్వాన్ని విమర్శించడం సరైంది కాదు!

- ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్



**హనుమకొండ, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):**కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని చూసి ఓర్వలేక కెసిఆర్ కాంగ్రెస్ వాటిని నాయకత్వాన్ని విమర్శిస్తున్నారని, ఇది ఆమోదాగ్యమైనది కాదని, అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు.. అనే విధంగా నీ వ్యవహారం ఉందని, 2004లో గతిలేక కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ దయవల్ల పది సీట్లు గెలిచావని, 2009లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుని 40 సీట్లకు పోటీ చేసి ఎన్ని గెలిచినావో నీ గుండె మీద చేయి వేసుకొని చెప్పాలని, 2014లో అధికారంలోనికి వచ్చిన నీవు తెలంగాణ ప్రజలను నిరుద్యోగులను ఏ విధంగా మోసం చేసినావో ప్రజలందరికీ తెలుసు. మీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని నిరుద్యోగులను మోసం చేసి నీ కుటుంబంలోని వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నావే తప్ప, తెలంగాణ ప్రజల జీవితాలు మారలేదని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ ఒక ప్రకటనలో అన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇచ్చావా.. దళితుడిని ముఖ్యమంత్రి చేశావా..?అమరవీరులను కనీసం పలకరించావా..? అమరవీరుల కుటుంబాలను ఆదుకున్నావా, రైతులు, విద్యార్థుల మరణానికి మీరు కూడా? పేద మహిళలు తిరిగే ఉచిత బస్సుల ను హేళన చేస్తావా? నీ నిజ స్వరూపం ప్రజలకు తెలుసు కాబట్టి నిన్ను అధికారం నుండి దించేశారని, సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిన తర్వాత మీ కుటుంబంతో వెళ్లి సోనియమ్మ కాళ్లు మొక్కినది అప్పుడే మర్చిపోయావా? అని ప్రశ్నించారు. సోనియా గాంధీ ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ల నాయకత్వం, మన డైనమిక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మన ప్రియతమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని కొనియాడారు.



## రైతులకు రుణము, విత్తనములు, ఎరువులు , ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**రేగొండ, ఏప్రిల్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):**సోమవారం అంతర్జాతీయ సహకార సంఘ ఉత్సవాల్లో భాగంగా ఈరోజు మండల కేంద్రంలో ఏప్రిల్ నెలలో నిర్వహించవలసిన సహకార సంఘాల సేవల విషయమై పి ఎ సి ఎస్. సీ ఈ వో జగన్ రైతులతో అవేర్నెస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా సర్కిల్ అధికారి శ్రావణ్ రెడ్డి. పాల్గొనీ. సేవా కేంద్రం నుండి .రైతులకు రుణము .విత్తనములు. ఎరువులు . ధాన్యంకొనుగోలు కేంద్రాలు. ఏర్పాటుచేసి రైతులకు అందుబాటులో సేవలు అందించే విధంగా చూస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నూతన వ్యవసాయ విధానాన్ని సహకార సంఘం నుండి అందిస్తామన్నారు. ఇట్టి కార్యక్రమంలో రేగొండ గోరికొత్తపల్లి. రైతులు సహకార సంఘం సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో ర్యాలీ...



**కరీంనగర్,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ లో జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారత్ మాత కి జై, వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా ఉపాధ్యక్షుడు సామ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండూరి శ్రీనివాస్,కొత్త ప్రకాశ్, రవీందర్, ఎల్ చంద్ర శేఖర్, టౌన్ అవోపా అధ్యక్షుడు నలుమచు సుదర్శనం, మాజీ అధ్యక్షులు కట్కూరి సుధాకర్, మారుతి, అంజయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం, అహల్గాంలో మరణించిన వారికి నివాళులు...




**హుజూరాబాద్,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలో ఒడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం మరియు పహేల్గాం లో ఉగ్రవాదుల చేతిలో మరణించిన వారికి నివాళులు అర్పించే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐసీసీ, కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్రావుతో కార్యక్రమంలో పాల్గొన్న కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్.



# రాశి సీడ్స్ ఆధ్వర్యంలో ప్రత్తి పంటపై రైతు సమృద్ధి సదస్సు





**చిట్యాల, ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** రాశి సీడ్స్ వారు ప్రత్తి పంట పై రైతు సమృద్ధి సదస్సు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాశి కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్, టి ఎస్ ఎం పవన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రత్తి పంటలను ఆశించే చీడపీడలు , తెగుళ్ల పై అవగాహన కల్పించారు. అలాగే కొత్త రకమైన రాశి స్విఫ్ట్ హైబ్రిడ్ గురించి రైతులకు వివరించడం జరిగింది అలాగే గత సంవత్సరం రాశి స్విఫ్ట్ పండించి అధిక దిగుబడులు పొందిన రైతులను సన్మానించి ప్రశంశ పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రైతులు మాకు తొందరగా పంట చేతికొచ్చి రెండవ పంట వేయడానికి అనుకూలంగా ఉందని ,ఎకరానికి 12నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని, ఎర్ర పురుగు లేని ప్రత్తి పంట పొందామని చెప్పారు . ఈ రకం రసం పీల్చే పురుగులను తట్టుకుని, ప్రత్తి ఏరడానికి సులువుగా ఉందని , పెట్టుబడి ఖర్చు బాగా తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో 350 మంది రైతులు కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ చందర్ రావు దేవేందర్ రామచందర్, డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ పాల్గొన్నారు.

# ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: ఆర్.జీ-త్రీ, జి.యం



**రామగిరి:ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** వేసవి కాలంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు అన్నారు.ప్రతి సంవత్సరం నిర్వహించే వేసవి శిక్షణలో భాగంగా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్.జీ-3 , ఏ.పి.ఏ ఏరియా ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను 18 సంవత్సరాలలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈనెల 29వ తేది నుంచి 25 రోజుల పాటు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు వాలీబాల్,ఫుట్ బాల్,ఆర్చరీ (విలువిద్య),హాకీ మొదలగు క్రీడల్లో ఉచిత వేసవి శిక్షణ ఇవ్వడం జరుతుందని,ఇట్టి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఆసక్తి ఉన్న 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలు తమ పేర్లను క్రీడల సమన్వయకర్త కె.నరసింహారెడ్డి,సెల్ నెంబర్ 9440560259 వద్ద నమోదు చేయించుకోవాలని అన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్.పి

**భూపాలపల్లి :ఏప్రిల్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబుని జిల్లా ఎస్.పి కిరణ్ ఖర్గే సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయ మరియు రక్షణ లా అండ్ ఆర్డర్ కంట్రోల్ విషయాల గురించి క్రైమ్స్ కంట్రోల్ సంబంధిత విషయాలపై వారు చర్చించారు. జిల్లా కోర్టులో జరిగిన ఈ భేటీలో సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ ఏ.నాగరాజు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేదాకా పోరాటం ఆగదు

• రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాల పెంపుకై వెంటనే చర్యలు తీసుకోవాలి •

**ఈనెల 30న హెడ్ ఆఫీస్ ముందు జరిగే దీక్ష మహాధర్నా లు జయప్రదం చేయండి**





**గోదావరిఖని,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈరోజు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 8వ కాలనీలోని సి.ఐ.టి.యు కార్యాలయంలో ప్రెస్ మీట్ జరిగింది. అనంతరం అర్జీ టు పర్సనల్ ఆఫీసర్ అనిల్ కుమార్ కి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వేతనాలు పెంచాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు రాష్ట్ర నాయకులు ఉల్లి మొగిలి, టి.యు.సి.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకలరమేష్, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు కెవిశ్వనాథ్, టి.సి.కే.ఎస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఐ.ఎఫ్.టి.యు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రత్నకుమార్ పాల్గొని మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటుంది. కోల్ ఇండియా ఒప్పందాల సైతం అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను వెట్టిచాకిరికీ గురిచేస్తుంది. గతసమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం లేబర్ కమిషనర్ సమక్షంలో చేసుకున్న అగ్రిమెంటు సైతం అమలు చేయడం లేదు. ఈ స్థితిలో సింగరేణి వ్యాప్తంగా మళ్లీ పోరాటం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది దానిలో భాగంగా ఈ నెల 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు నిరసన దీక్ష మహా ధర్నా చేపట్టాలని నిర్ణయించింది. మే డే రోజున వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈనెల 30న జరిగే నిరసన దీక్ష మహాధర్నాలో సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ముష్కి రామస్వామి, దాముక లచ్చన్న, రవి నాని పాల్గొన్నారు.

# పోచంపల్లి గురుకుల బాలికలను అభినందించిన ఎమ్మెల్యే...



**తిమ్మాపూర్,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన మానకొండూర్ మండలం పోచంపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు పిల్లి అంజలి, బాకారపు రక్షితలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఎల్.ఎం.డీ కాలనీలో క్యాంపు కార్యాలయానికి వచ్చిన అంజలి, రక్షితలు ర్యాంకులు సాధించడంపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ హర్షం వ్యక్తం చేస్తూ సదరు బాలికలను అభినందించారు. వేర్వేరు గ్రూపుల్లో అంజలి 500 మార్కులకుగాను 492, రక్షిత 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించడం సంతోషకరమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కష్టపడి చదివి మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు కోండ్ర సురేష్, శ్రీనివాస్ గౌడ్, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొత్త తిరుపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు,ఇంచార్జీలు బి.శ్రీనివాస్,తిరుపతిగౌడ్, శ్రీరాం శ్రీనివాస్,డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్గఢ్ పోలీసుల కస్టడీలో ఉన్న ఆదివాసుల్ని వెంటనే విడుదల చేయాలి

• పౌర హక్కుల సంఘం తెలంగాణ..



**హైదరాబాద్,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల ఏప్రిల్ 22వ తారీఖున ఆపరేషన్ కగార్ పేరుతో బీజాపూర్ జిల్లా అడవిలో ఉన్న గ్రామాల ఆదివాసుల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినారు.నిర్బంధం చేసినటువంటి వారిని వెంటనే విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ డిమాండ్ చేస్తున్నది.ఏప్రిల్ 22వ తేదీ రాత్రి కిష్టాపురం, తాళ్ల గూడెం, పూజారి కాంకేర్ కర్రిగుట్ట చుట్టూ ఉన్న గ్రామాల్లో ఆదివాసులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజుకి మూడు రోజులవుతున్న వాళ్ళు ఎక్కడున్నారో తెలియక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. వారిని ఇప్పటి వరకు ఐదు రోజులైనా విడుదల చేయలేదు, కోర్ట్ లో కూడా హాజరు పరచలేదు.వారిని ఎన్కౌంటర్ పేరుతో చంపే ప్రమాదం ఉంది. కాబట్టి వాళ్ళని వెంటనే విడుదల చేయాలని లేదా కేసులు ఉంటే కోర్టులో అప్పజెప్పాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది.... ఇప్పటికే గత పదిహేనునెలల కాలంలో యాభైరెండు ఎన్కౌంటర్లలో ఐదువందల మందిని ఆపరేషన్ కగార్ ఎన్కౌంటర్లతో హత్య చేసింది.ఈ నేపథ్యంలో అరెస్ట్ చేసిన ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలని,ఇప్పటికైనా ప్రభుత్వమే హింసాపాలన ను వదిలి వెంటనే,ఆపరేషన్ కగార్ నిలిపివేసి ,శాంతి చర్చలకు సిద్ధమన్న మావోయిస్ట్ పార్టీతో చర్చలు జరపాలని ,అదుపులో ఉన్న ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలని పౌరహక్కులసంఘం డిమాండ్ చేస్తున్నది.ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్,అధ్యక్షులు పౌరహక్కులసంఘం తెలంగాణ. N. నారాయణ రావు,ప్రధాన కార్యదర్శి,పౌరహక్కులసంఘం తెలంగాణ. 27/04/25. హైదరాబాద్.

# వీణవంక, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు...

• జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ...



**వీణవంక,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డి ఎం హెచ్ వో డాక్టర్ చందుతో కలిసి ఈరోజు ఉదయం వీణవంక మరియు చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని హాజరు పట్టిక మరియు రికార్డులను పరిశీలించడం జరిగింది.ఇన్ వార్డులో చికిత్స తీసుకుంటున్న పేషంట్లతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అదేవిధంగా ఫార్మసీ స్టోర్ లోని వేసవి కాలానికి సంబంధించి మందుల నిల్వలను, కుక్క కాటు మందులను పరిశీలించారు. లేబరేటరీ మరియు ఎన్సీడీ క్లినిక్ లను సందర్శించి రక్తపోటు మరియు డయాబెటిస్ రోగులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని ప్రతి నెల వారికి మందుల పంపిణీ రికార్డు పరిశీలించారు మరియు అక్కడికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని లేబర్ రూమ్ లను సందర్శించి గౌరవ కలెక్టర్ మేడం గారి సూచనల మేరకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొదటి కానుపు లన్నీ గవర్నమెంట్ నార్మల్ డెలివరీల కొరకు ప్రోత్సహించి సిజేరియన్ డెలివరీల పర్సంటేజీ తగ్గించాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని నార్మల్ డెలివరీలను పెంచాలన్నారు. అదేవిధంగా అవుట్ రీచ్ కేంద్రాలలో ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలందరికీ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వరుణ,డాక్టర్ సుచిత్ర మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టులకు ప్రత్యేకంగా రుణాలు కేటాయించాలి...

• జర్నలిస్ట్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్(ఏడిజెఎఫ్) తీగల శ్రీనివాస్ రావు



**మంచిర్యాల,28ఏప్రిల్(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి జీత భత్యాలు లేకుండా నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిస్వార్థంగా సేవ చేస్తున్న జర్నలిస్ట్ లకు ప్రత్యేకంగా రుణాలను కేటాయించాలని అల్ డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే గొప్ప ఉద్దేశం తో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఉన్నత చదువులు చదివి జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రత్యేక అవకాశం కల్పించినట్లైతే వారిని ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహించినట్టు అవుతుందని అన్నారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్ జీవితాలు మారలేదన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం లో రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టుల కు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో రాజ్యాంగ పరిరక్షణ భారీ పాదయాత్ర...

• పాదయాత్రలో పాల్గొన్న ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్




**కరీంనగర్,ఏప్రిల్28(పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలో రాజ్యాంగ పరిరక్షణ ముగింపు పాదయాత్ర నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు.ఈ పాదయాత్రలో ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్ మరియు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ మరియు అంబేద్కర్ యొక్క ప్రాధాన్యత తగ్గించే విధంగా బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వారు ఈ దేశ స్వాతంత్ర్యం పోరాటం చేసి అనంతరం దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహానుభావులని కొనియాడారు. మార్కెట్ వెంకటేశ్వర దేవాలయం నుండి ప్రారంభమైన భారీ పాదయాత్ర టవర్ సర్కిల్ మీదుగా రాజీవ్ చౌక్ నుండి గాంధీ రోడ్డు లోని గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్,కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్,రుద్ర సంతోష్,వెలిచాల రాజేందర్ రావు,ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్ మాజీ కార్పొరేటర్లు సిటీ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దేశానికి రోల్ మోడల్‌గా భూభారతి చట్టం

**- భూ సమస్యల పరిష్కారానికి అద్భుతమైనది భూభారతి చట్టం**

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**







**హనుమకొండ, ఏప్రిల్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించామని, దేశానికి రోల్ మోడల్ గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూ భారత్ చట్టం అవగాహన సదస్సును నిర్వహించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ చదివి వినిపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ తమ భూ సమస్యలకు సంబంధించి ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాగా వాటికి భూభారతి చట్టం ద్వారా ఉన్న పరిష్కారం మార్గాలను ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక తహసిల్దార్ జగత్ సింగ్ తెలియజేశారు. రైతులు ఈ చట్టానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. పలువురు రైతులు ధరణి పోర్టల్ ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు, భూ సమస్యల పరిష్కారం కోసం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా లభించనున్న పరిష్కారం గురించి సభా వేదిక వద్ద మంత్రుల సమక్షంలో వివరించారు. సభా ప్రారంభానికి ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి అద్భుతమైన చట్టాన్ని అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే విధంగా చట్టాలను అమల్లోకి తీసుకువస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను అందులోని అంశాలను పరిశీలించి, రాష్ట్రవ్యాప్తంగా మేధావులు, రైతులు సలహాలు సూచనలతో రూపొందించిన మార్గదర్శకాలతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. దేశం లోనే భూ సమస్యల పరిష్కారం కోసం అద్భుతమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ చట్టంలో ఫలితాలను చూడాలని రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. భూభారతి చట్టం పై రాష్ట్రం లోని అన్నీ మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న మీ ఇంటి వద్దకే రెవెన్యూ అధికారులను పంపించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తారని అన్నారు. 2020లో వచ్చిన ధరణి చట్టానికి భూ సమస్యలను పరిష్కరించే ఎలాంటి రూల్స్ లేవన్నారు. ప్రతి భూ సమస్య పరిష్కారానికి భూభారతి చట్టంలో మార్గాలు ఉన్నాయన్నారు. సాదా బైనమా అంశాలను ధరణిలో పొందు పరచలేదన్నారు. ధరణి విషయమై భూ సమస్యల పరిష్కారం కోసం కోర్టుల వరకు వెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రంలో అప్పుల భారం ఉన్నా కూడా పేదవాడి కలను సాకారం చేసేందుకు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. పేదవారికి చెందిన భూమిని పేదవారికే ఇచ్చేందుకు భూ భారతి చట్టం తోడ్పడుతుంద న్నారు. ఏ ఒక్క నిరుపేద రైతన్న ఏ ఆఫీస్ చుట్టూ తిరిగినవసరం లేదని, మీ ముందుకే అధికారులు వస్తారని అన్నారు. రైతులకు ఒక్క పైసా కూడా ఖర్చు లేనివిధంగా భూ భారతి చట్టం ద్వారా భూ సమస్య పరిష్కారానికి ఉపయోగ పడుతుందన్నారు. అప్లికేషన్ ఫారాన్ని అధికారులే అందజేస్తారని అన్నారు. భూ సమస్యలు శాశ్వతంగా.. సులువుగా పరిష్కారమయ్యే విధంగా భూ భారతి చట్టం రూపొందించినట్లు చెప్పారు. ఈనెల 30వ తేదీ నాటికి అన్ని మండలాల్లో భూభారతి చట్టంపై రైతు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో పైలెట్ గా ఒక మండలాన్ని ఎంపిక చేసుకొని భూ భారతి చట్టం ద్వారా పరిష్కార మార్గాలను అధికారులు తెలియజేస్తార న్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ప్రభుత్వం మండలాల్లో భూభారతి చట్టం సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ మూడవ తేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రతి భూ సమస్యల పరిష్కారానికి చట్టం ద్వారా అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చట్టాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలులో అధికారులు ఎలాంటి తప్పులు చోటు చేసుకోకుండా బాధ్యతగా వ్యవహరించా లన్నారు. అధికారులు ఎక్కడైనా తప్పు చేసినట్లయితే చర్యలు ఉంటాయన్నారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. భూభారతి చట్టం ద్వారా పేద ప్రజలకు తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన భూభారతి చట్టం రైతుల చుట్టమని పేర్కొన్నారు. న్యాయమైన ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాలని సూచించారు. రాబోయే నాలుగు సంవత్సరాల లో ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, 20 లక్షల ఇళ్లను కట్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. మొదటి విడతలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అత్యంత నిరుపేదలకు అందిస్తుందన్నారు. తమది పేదల ప్రభుత్వం అని పేర్కొన్నారు. పేదవాడి ప్రభుత్వము. సన్న బియ్యం మాదిరిగానే భూభారతి చట్టంతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఎన్ని ఇబ్బందులు ఉన్నా చిత్తశుద్ధితో ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. భూభారతి చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం..విశ్వాసమని అన్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించి హక్కులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సన్న ధాన్యానికి బోనస్ డబ్బులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు ను ప్రారంభించగా గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టులు పూర్తి చేస్తుందన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్నామని, రైతన్నలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పేద ప్రజల ఇళ్లల్లో సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు వచ్చిందన్నారు. వీటితోపాటు గ్రామాలలో మొదటి దశలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా ఉండాలని ఉద్దేశంతోనే భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. రైతుకు భూమికి విడదీయని బంధం ఉంటుందన్నారు. రైతులకు అనేక సందర్భాలలో భూమి అండగా ఉంటుందన్నారు. ధరణి పోర్టల్ తీసుకురావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భూభారతి చట్టం ఎంతోమంది మేధావులు, రైతులు, ఎన్నో వర్గాల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు చేసినదే ఈ చట్టం అని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు ఈ చట్టంపై పూర్తి అవగాహనను పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో రైతులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. భూభారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం లభిస్తుందన్నారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి విచారణ జరిపించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సబ్సిడీ రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

---

# సభ విజయవంతంతో కాంగ్రెస్ పార్టీ గుండెలు దడేల్

- **సభ సక్సెస్‌లో భాగమైన బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదములు.**
- **ప్రతి ఒక్కరిని దగ్గరుండి సభకు తీసుకెళ్లి,క్షేమంగా ఇంటికి తిరిగి రావడంలో ముఖ్య భూమిక పోషించిన మా కార్యకర్తలకు కృతజ్ఞతలు**
- **సభకు వచ్చే జనసమూహాన్ని చూసి బయపడి ట్రాఫిక్ జామ్ చేయడంలో తమ హస్తన్ని ప్రదర్శించిన పోలీస్ అధికారులు**
- **మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**



**భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** సభ విజయవంతం కావడంలో మరియు కార్యక్రమంలో ఎటువంటి అపశృతి జరగకుండా ముఖ్య భూమిక పోషించిన పట్టణ మరియు మండల ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...,ప్రజలు కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలు నమ్మి అధికారాన్ని వాళ్ళకి ఇవ్వడం జరిగింది. ఒకే సంతకంతో నేను రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పి,ఆయన చేయలేకపోతున్నప్పుడు దేవుళ్ళ మీద ఒట్టు పెట్టుకున్నారు. నాకు తెలిసి భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమంత్రి భగవంతుడు మీద ఒట్టు వేసి నేను ఈ స్కీములు పూర్తి చేస్తా అని చెప్పి ఇంత ఘోరంగా మాట తప్పినట్టువంటి సందర్భాలు అది కేవలం రేవంత్ రెడ్డి కి మాత్రమే దక్కింది. దేవుని యొక్క ఆగ్రహాన్నికి కూడా రేవంత్ రెడ్డి కారకుడావుతారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎట్లున్న ఎన్ని సమస్యలు వచ్చినా కరోనా లాంటి ఒక విపత్కరమైనటువంటి వ్యాధి వచ్చిన అవసరమైతే ఉద్యోగుల జీతాలైన ఆపివేస్తా తప్ప రైతుబంధు ఆపను అని రైతులకు వర్షం చినుకు పడకంటే ముందే పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ. 5000/- ఇచ్చినట్టువంటి సందర్భం. కేసీఆర్ నేను ఉన్నంతకాలం ఈ రైతుబంధు ఆగడానికి వీలు ఉండదు అని చెప్పి ఆ రకంగా రైతుల విశ్వాసాన్ని చవి చూడటం జరిగింది. ఆనాడు కేసీఆర్ రైతుబంధు ఇస్తుంటే అవసరమా రైతు బంధు పథకం అని సాక్షాత్తు నేటి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెన్షన్ భార్యకి భర్తకు ఇద్దరికీ ఇస్తా అని చెప్పి కనీసం భర్త చనిపోయిన మహిళకు భర్తకి వచ్చే పెన్షన్ కూడా ఇవ్వలేకపోతున్నాడు. పెళ్ళి చేస్తే కళ్యాణలక్ష్మీ రూ. 1,00,000/- అదనంగా తులం బంగారం అన్నాడు దాని ప్రస్తావనే లేదు. ఇళ్ళకోసం అప్లై చేసుకున్న అందరి పేర్ల లిస్ట్ చదివిర్రు మరి ఎంత మందికి మంజూరు అయింది ప్రజలకు తెలియకుండా దాచడంలో అధికారుల మతలబు ఏంటో అర్ధం కావడం లేదు. అందుకే కేసిఆర్ అన్నారు తెలంగాణ రాష్ట్రాన్నికి ఉన్న ఒక్కే ఒక్క విలన్ కాంగ్రెస్ పార్టీ అని. ముఖ్యమంత్రి స్థాయి నుండి కింది స్థాయి వరకు ఎవరూ కూడా ఈ రాష్ట్రాన్ని సమర్ధవంతంగా చక్కటి పరిపాలన చేయాలన అవసరం ఉన్నట్టుగా వాళ్ళు గుర్తించడం లేదు. నేను తలుచుకుంటే కేసులు పెడుతుతా జైల్లో పెడుతా అని పోలీసు అధికారులను పెట్టి కంట్రోల్ చేయాలని చూస్తున్నారనేది స్పష్టంగా కనిపిస్తుంది. అందుకు ఉదాహరణ నిన్న జరిగినటువంటి సభకు ఇంత మంది జనం వస్తా ఉంటే ప్రభుత్వం గుండెలు బరువెక్కినయి,వాళ్ళ గుండెల్లో రైలు పరిగెత్తినై కాబట్టే ట్రాఫిక్ కంట్రోల్ చెయ్యడంలో పోలీస్ అధికారుల డొల్లతనం కనిపించింది. గతంలో కేసీఆర్ ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు సరిగా అందినై కరెంటు సక్కగా వచ్చింది. పెన్షన్స్ టైమ్ కి వచ్చినయ్ అన్ని కూడా ఇచ్చిన మాట ప్రకారం అన్ని కూడా జరిగినవి. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయట్లేదని దానితోటి ఈ ప్రజలకు మళ్ళీ కేసీఆర్ గుర్తొస్తున్నారు కాబట్టి ఒక కేసీఆర్ పిలుపునిస్తే పది లక్షల మంది జనం కదిలారు సభ విజయవంతం అయింది. సభ సక్సెస్ లో భాగమైన బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదములు. ప్రతి ఒక్కరిని దగ్గరుండి సభకు తీసుకెళ్లి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షేమంగా ఇంటికి తిరిగి రావడంలో ముఖ్య భూమిక పోషించిన మా కార్యకర్తలకు కృతజ్ఞతలు.

---



## కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి హాజరైన మానకొండూర్: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఇందిరా గార్డెన్స్ లో జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో జరిగిన ముఖ్య సమావేశానికి హాజరైన మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మరియు ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ పెరుమాళ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్,, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.



# పన్నుల విధానంతో ధరల స్వారీ

దేశంలో ఆహార ధరల పెరుగుదల అంతకంతకూ ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల వంటనూనెల ధరలు మరింత ప్రియంగా మారాయి. ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా పండుతున్నా ప్రజలకు మాత్రం చౌకగా దక్కడం లేదు. పేదవారి పట్ల పార్టీలు వేరైనా పాలకులంతా మొసలి కన్నీరు కారుస్తోంది. కాకమ్మ కబుర్లు చెప్పి కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారం కోసం నానాగా గడ్డీ కరుస్తున్నాయి. దేశంలో అన్ని వస్తువుల,సేవల ధరలూ పెరిగిపోతూ వుంటే, దాని ప్రభావాన్ని తట్టుకుని భరించే స్థితిలో సామాన్య ప్రజలు లేరు. ప్రభుత్వాలు తాము పెంచుతున్న ధరలు కావచ్చు..జిఎస్టీ కావచ్చు..గ్యాస్ కావచ్చు సామాన్యులకు భారం పడదన్న ధోరణిలో ఉన్నారు. నిజానికి ఏ వస్తువు అయినా ధరలు వెచ్చించి సామా న్యులు కొనాల్సిందే. ఏకీకృత పన్ను విధానం పేరుతో తీసుకుని వచ్చిన జిఎస్టీ ఇప్పుడు సామాన్యులకు గుదిబండగా మారింది. పాన్, ఆధార్ లింక్ కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారనుంది. దీనికితోడు కనీసం వేయి రూపాయల ఛార్జీ వడ్డిస్తున్నారు. దీనికితోడు తాజాగా యూపిఐ చెల్లింపులపై ట్యాక్స్ విధించే ఆలోచన దుర్మార్గం కాక మరోటి కాదు. అప్పుడెప్పుడో జుట్టు పన్ను కూడా విధించారు. ఇప్పనుడు అదే తరహాలో పన్నులేని పని, వస్తువు, సేవలు లేకుండా పోయాయి. పన్నుల రూపంల ప్రజలు ఇల్లు గుల్ల చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇప్పుడు ధరలు సవారీ చేస్తున్నాయి. బంగారం, వెండి ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. ఇవి ప్రభుత్వ అజమాయిషీ లేని జాబితాలో చేరాయి. వారి ఆదాయాలు పెరగకుండా ధరల పెరుగుదల ను భరించే స్థితిలో ప్రజలు ఉన్నారా లేరా..అన్నది కూడా పాలకులు ఆలోచన చేయడం లేదు. శ్రామిక వర్గ ఆదాయాలు పెరిగే ధరలకు అనుగుణంగా పెరగగకుంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. శ్రామిక ప్రజల ఆదాయాలు పెరగవని తెలుసు. పెరగడం లేదని కూడా తెలుసు. భారమంతా శ్రామిక వర్గమే అంతిమంగా భరించాల్సి వస్తుందని కూడా పాలకులు తెలుసు. తెలిసి కూడా పెట్రో,గ్యాస్, జిఎస్టీ ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా చేస్తున్నారు. ఇక సామాన్యుల ఇంటికలను ఛిద్రం చేసేసారు. సామాన్యులు సొంతంగా ఇల్లు కల్లుకునే పరిస్థితి లేదు. మరోపక్క అంతర్జాతీయ చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ, దేశీయంగా పెట్రో ధరలను పెంచి తీరాలన్న సూత్రం ఏదీ లేదు. కానీ అలా పెంచడం వల్ల ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. పెట్రోల్ అన్నది ఇప్పుడు కేంద్రానికి ఆదాయవనరుగా మారింది. పెట్రో ధరల పెంపు అనేది ప్రభుత్వం అనుసరించే ద్రవ్య వ్యూహం బట్టి ఉంటుంది. ఈ ద్రవ్య వ్యూహాన్ని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు మార్చుకునే వీలున్నా అందుకు కేంద్రం సిద్దంగా లేదు. పెట్రో ధరలను తమకు ఇష్టం లేకున్నా పెంచవలసి వస్తోందని వాపోవడం దొంగనాటకం కాక మరోటికాదు. పెట్రో ఉత్పత్తుల ధరలో దాదాపు సగం భాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులకే పోతుంది. ఈ పన్నులకి, అంతర్జాతీయ చమురు ధరలకి సంబంధం లేదు. అయినా ఆ పన్నులను పెంచుకుంటూ దోచుకుంటున్నారు. రాజకీయ నాయకుల జీతభత్యాలపై మాట్లాడడం లేదు. అనవసర ఖర్చులపై మాట్లాడడం లేదు. తన వంతు అదనంగా ప్రజల మీద కేంద్రంలోని మోడీ ప్రబుత్వం భారాన్ని మోపుతూనే పోతోంది. రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని కొంత వరకూ అర్ధం చేసుకోవచ్చు. వాటి పరిధిలో పరిమితమైన ఆదాయ వనరులే ఉన్నాయి. ముఖ్యంగా జి.ఎస్.టి విధానం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలు బాగా తగ్గిపోయాయి. పెట్రో ఉత్పత్తులు జిఎస్‌టి పరిధి లోకి రావు. అందుకే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు పెట్రో ఉత్పత్తుల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్ష పన్నులు విధించే అధికారం లేనందువలన వాటికి వేరే దారి లేదు. కాని కేంద్ర ప్రభుత్వం వేరు. వేర్వేరు మార్గాల్లో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కాని కావాలనే అది ఆ మార్గాలను ఉపయోగించడంలేదు. సంపన్నులమీద ప్రత్యక్ష పన్నులు విధించవచ్చు. ఆ సంపన్నుల పట్ల పక్షపాత వైఖరితో ప్రభుత్వం ఉంది కాబట్టి ఆ ప్రత్యామ్నాయాన్ని అది ఆలోచించడం లేదు. సంపన్న వర్గాలే పెట్రో ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగిస్తాయి గనుక పెట్రో ఉత్పత్తుల మీద ధరలు పెరిగితే వారిమీదే భారం ఎక్కువగా




పడుతుందని ఎవరైనా భావిస్తే అది చాలా పొరపాటు. పెట్రో ఉత్పత్తులలో సామాన్య ప్రజలు నేరుగానే వినియోగిస్తారు. ఇందుకు ఉదాహరణ వంట గ్యాస్. ఇక పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే రవాణా చార్జీలు అనివార్యంగా పెరుగుతుంటాయి. దానితోబాటు వినిమయ వస్తువుల ధరలన్నీ పెరుగు తాయి. వాటిలో ఆహార ధాన్యాలతో సహా చాలా వస్తువులను ప్రజలే ఎక్కువగా వినియోగిస్తారు. ఇక సంపన్నులు పెట్రో ఉత్పత్తులను వినియోగించి ఉత్పత్తి చేసే వివిధ రకాల సరుకుల రేట్లను పెంచి అమ్ముతారు. ఆ విధంగా కూడా అంతిమంగా వినియోగదారుల పైనే భారం అంతా పడుతుంది. పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని సామాన్య ప్రజలు మాత్రమే కోరుకుంటారు. ఎందుకంటే వారే నేరుగా బాధ్యలు కనుక. వినిమయం తగ్గితే మార్కెట్‌లో మాంద్యం మరింత పెరుగుతుంది. అది మరింత ఎక్కువ గా నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఆ విధంగా ఒక వైపు ద్రవ్యోల్బణం, మరోవైపు మాంద్యం ఆర్థికంగా దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల పంపిణీని నియంత్రించి రేషనింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా కొంత కంట్రోల్ చేయవచ్చు. నిజాయితీ ఉంటే ప్రత్యామ్నాయ ద్రవ్య విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడాలి. అదికూడా ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాలి. అప్పుడే ప్రజలపై భారం పడదు. నిజానికి ప్రజల నుంచి డబ్బులు గుంజడమెలా అన్నది కేంద్రం చేస్తున్న ఆలోచన.. జిఎస్టీతో ప్రజలు అల్లాడుతున్నా..పన్నులు కట్టలేక చస్తున్నా..పెట్రోల్ ధరలతో దాడులు చేస్తున్నా.. పట్టించు కోని ప్రధాని మోడీ రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని గతంలో చేసిన సూచనలు ప్రజలంతా గమనిస్తున్నారు. మోడీ వచ్చాక వివిధ రూపాల్లో జిఎస్టీ వసూళ్లు లక్షల కోట్లలో పెంచుకుంటున్నారు. కానీ ప్రజలపై పడుతున్న భారాలపై మాట్లాడడం లేదు. నిజానికి మోడీ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఏ అంశం పైనా చర్చించడం లేదు. ప్రజలను విస్మరించి చేస్తున్న పాలన కారణంగా ప్రజలు నానా యాతన పడుతున్నారు. ప్రజలు ఈ అంశాలపై చర్చించాలి. పాలకుల నిజ స్వరూపాన్ని నిగ్గదీయాలి. అప్పుడే పాలకులు దారికొస్తారు.

## పెట్రోల్‌పై ఎక్సైజ్, వ్యాట్ ధరలు

**● వాటిని తగ్గిస్తే కొంతమేరకుమేలు ● అప్పడే సామాన్యులకు ఊరట**

**న్యూఢిల్లీ,ఏప్రిల్28:** దేశంలో పెరుగుతున్న దరల కారణంగా పెట్రో ధరలను కంట్రోల్ చేస్తే..ఇతరత్రా రవణా ఛార్జీలు తగ్గుతాయి. ఆ మేరకు సరుకులపైనా ధరలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచన చేయడం లేదు. గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచిన్నటైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జిఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతూనే వచ్చారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ది చాటుకుంటే బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను వ్యాట్ తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్టపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచు కోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థా ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.






## మానవత్వానికి మాయని మచ్చ

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమానవీయమైనది. మానవత్వమే తలదించుకునే విధంగా ఆ హత్యాకాండ జరిగింది. అందులో మరణించిన వారి కుటుంబాలకు జరిగిన నష్టాన్ని, వ్యక్తులుగా, సంస్థలుగా, ప్రభుత్వాలుగా ఎవ్వరం భర్తీ చేయలేం. ఇటీవల జరిగిన ఘటనల కన్నా ఇది కోట్లాది మందిని కలవరపరిచింది. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులకు జరిగిన ఈ ఘోర అనుభవాన్ని ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారు. అన్ని రాజకీయ పార్టీలు దీనిని ముక్తకంఠంతో ఖండించాయి. ఇతర ప్రజా సంస్థలు, సంఘాలు, వ్యక్తులు అందరూ ఈ నరమేధాన్ని తీవ్రంగా నిరసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్)ను, దానికి సహకారం అందించారని భావించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదనుకుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు. అదే విధంగా దాడికి బాధ్యులైన వారి లక్షంగా గాలింపు ముమ్మరం చేశారు. ఇవన్నీ ఊహించినవే. ప్రజల నిరసన, ప్రభుత్వ తీవ్ర నిర్ణయాలు, రాజకీయ ఏకాభిప్రాయం అన్ని కూడా అనుకూలంగానే. అయితే వీటన్నింటికి తోడుగా కశ్మీర్ ప్రజల్లో పెల్లుబుకిన నిరసన, హత్యాకాండపట్ల వాళ్ల ఆవేదన భారత ప్రభుత్వానికి ఎంతో నైతికంగా గొప్ప విజయం. కశ్మీర్‌లోని చాలా చోట్ల ప్రజలు వీధుల్లోకి వచ్చి, ఇది ఒక మతం మీద జరిగిన దాడి కాదని, మానవత్వం మీద జరిగిన దురాగతంగా ప్రకటించారు. నేను చూసిన కొన్ని మీడియాల్లో ముఖ్యంగా శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో మాట్లాడిన మాటలు, నిరసన తెలిపిన తీరు ఉగ్రవాదులకు చెంపపెట్టుగా భావించాలి. శాంతి కావాలి, కశ్మీర్‌లు భారత్ వైపే, మాకు టెర్రరిజం వద్దు అంటూ ప్రదర్శించిన ప్లకార్డులు గత కొంత కాలంగా కశ్మీర్ ప్రజల్లో ఉన్న భావాలను బయటపెట్టాయి. కశ్మీర్ ప్రజలు అటు టెర్రరిస్టులతో, ఇటు సైన్యంతో చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ ఈ రోజు వాళ్లు భారత్ వైపే అని ప్రకటించి తమ మార్గాన్ని చాటుకున్నారు. గత ఇరవైఐదు ఏళ్లలో అధికారిక లెక్కల ప్రకారం 2000 నుంచి 2025 మార్చి వరకు దాదాపు 22,415 మంది మరణించినట్టు తెలుస్తున్నది. ఇందులో సాధారణ పౌరులు 4980 మంది, సైనిక బలగాల నుంచి 3623 మంది, ఉగ్రవాదులు, చొరబాటుదారులుగా భావించిన వాళ్లు 13,390 మంది, వివరాలు తెలియని వాళ్లు 422 మంది వున్నారు. ఇందులో ఎక్కువ మంది అంటే సైనిక బలగాలు మినహాయించి మిగతావాళ్లంతా కశ్మీరీలే. ఎన్నో కుటుంబాలు ఎందరినో కోల్పోయాయి. ఇదంతా కశ్మీరీల మెదళ్లను తొలుస్తున్నది.గత కొంతకాలంగా కొంత ప్రశాంత వాతావరణం ఏర్పడింది. 2018 సంవత్సరంలో 228 ఉగ్రవాద దాడులు జరగగా, 2023లో అది 46కు తగ్గింది. పర్యాటకుల సంఖ్య కూడా బాగా పెరిగింది. 2020లో 34 లక్షల మంది పర్యాటకులు కశ్మీర్‌కు రాగా, 2023లో అది 2 కోట్ల 35 లక్షలకు పెరిగింది. ప్రస్తుత సంవత్సరం కేవలం 26 రోజుల్లోనే 8 లక్షల 14 వేల మంది తులిప్ గార్డెన్‌ను సందర్శించారు. కశ్మీర్ పర్యాటక రంగం అక్కడి ప్రజలకు ప్రధాన జీవనాధారం. పదిహేను వేల హౌస్ బోట్స్ ఉన్నాయి. మూడు వేలకు పైగా హోటల్ గదులున్నాయి. లెక్కలేనన్ని వాహనాలు, వేలాది టూర్ గైడ్స్, ఇతర చిన్నచిన్న దుకాణాలు పర్యాటకం మీద ఆధారపడి జీవిస్తున్నారు. నిరుద్యోగం రేటు కూడా తగ్గింది. 2019 20లో నిరుద్యోగ రేటు 6.7 శాతం ఉండగా, 2023 24 లో అది 6.1కు పడిపోయింది. అయితే పహల్గాం దాడి తర్వాత దాదాపు 62 శాతం కుటుంబాలు కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నాయి. ఇది కశ్మీర్ ప్రజల మీద తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశముంది. అయితే టివి చానెల్స్‌లో మాట్లాడిన వాళ్లలో పర్యాటక రంగం గురించి మాట్లాడిన వాళ్లు ఉన్నారు. అయితే దానికి సంబంధం లేకుండా ఒక మానవత దృక్పథం మేరకు ఈ దాడిని ఖండిస్తున్నామని అన్న వాళ్లు కూడా ఉన్నారు.కశ్మీర్ సమస్య ఈనాటిది కాదు. దీని మీద వందల పుస్తకాలు వచ్చాయి. ఎంతో మంది నివేదికలు రూపొందించారు. ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి. కాని సమస్య కొలిక్కి రాలేదు. దీనికి కారణం పరిస్థితులే. కానీ ఈ రోజు పరిస్థితులు మారాయి. ముఖ్యంగా కశ్మీర్ ప్రజల్లో గతంలో పాకిస్థాన్‌తో ఉన్న స్నేహ దృక్పథం ఇప్పుడు పూర్తిగా పోయినట్టు కనిపిస్తున్నది.కేంద్రం 2019లో 370 ఆర్టికల్ రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని తీసివేసిన తర్వాత కేంద్రం పట్ల కశ్మీర్‌లో వ్యతిరేకత పెరిగిన మాట వాస్తవం. అది గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వ్యక్తమైంది. అయితే ఇప్పుడు వివాదాన్ని కశ్మీరీలు ప్రజాస్వామ్యయుతంగా పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. నిన్న, మొన్న టివి చానళ్లలో మాట్లాడిన యువకులు, యువతులు కూడా దీనిని ప్రస్తావించి, దీనిని మేము ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఆలోచిస్తామని చెప్పడం మంచి పరిణామం. అదే విధంగా భారతదేశంలోనే తాము భాగమని, పర్యాటక రంగం ద్వారా తాము జీవిస్తున్నామని, అది కూడా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజల సహకారంతో తాము ఇక్కడ మనుగడ సాగిస్తున్నామని ప్రకటించడం కూడా ఆహ్వానించదగిందే.అయితే ఇక్కడే ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం చాలా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని నిపుణులు, దౌత్యవేత్తలు భావిస్తున్నారు. అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ సంజయ్ కౌల్ ఈ విషయమై చాలా వివరమైన వ్యాసం రాశారు. భారతదేశం ఈ విషయంలో దృఢమైన వైఖరిని కలిగి ఉండాలి. రక్షణపరమైన చర్యలు చేపడుతూనే, విద్యా విధానంలో సమూలమైన మార్పులు, మతపరమైన సంస్థల్లో సంస్కరణలు చేపట్టాలి. అదే విధంగా ప్రజల అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి వేదికలు, అవకాశాలు కల్పించాలి’ అంటూ తన స్పష్టమైన వైఖరిని వెల్లడించారు.ఇందులో మొదటి అంశాన్ని కేంద్రప్రభుత్వం చాలా తీవ్రంగానే తీసుకుంటున్నది. అనివార్యమైతే యుద్ధం దాకా కూడా భారత ప్రభుత్వం వెళ్లవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. మిగతా విషయాలను ప్రస్తుతం కాకపోయినా పరిస్థితులు చల్లబడిన తర్వాత ప్రభుత్వం అక్కడి ప్రజల మనసులను గెలుచుకోవడానికి ప్రయత్నిస్తుందని భావించవచ్చు. ముఖ్యంగా యువతలో నెలకొన్న నిరుద్యోగం, నైరాశ్యం గురించి ఆలోచించి పథకాలు రచించాలి.అందులోనే సంజయ్ కౌల్ మరొక విషయాన్ని చెప్పారు. ఇప్పటి వరకు కశ్మీరీ యువతకు బయటి ప్రపంచం గురించిన అవగాహన లేదు. ఇటీవల కశ్మీరీ యువతీ యువకుల్లో అన్ని ప్రాంతాల వాళ్లలాగా ప్రశాంత జీవనం గడపాలనే కోరిక బలంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అటు ప్రభుత్వం, ఇటు కశ్మీరీ ప్రజలు శాంతి కోసం, ప్రజాస్వామ్యం కోసం అంతిమంగా దేశ సమగ్రత కోసం తమ తమ పరిధుల్లో సానుకూలంగా వ్యవహరిస్తే ఇటువంటి ఘోరాలలో ఇదే చివరిది కావచ్చు. దీనికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాలి. ఎందుకంటే కశ్మీర్ భారత దేశం తలమానికం. అది కిరీటం లాంటిది, ఎంతో సుందరమైనది. అందమైనది. ఆహ్లాదమైనది. అది అందరిది కావాలి. కశ్మీర్‌లో శాంతికి, ప్రజాస్వామ్యానికి మనమంతా చేయూత నివ్వాలి.



# రావిడపూడి-చిరు సినిమాపై భారీ అంచనాలు

**• చిరుకు జోడీగా నయనతార అంటూ వార్తలు**

మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావుపూడి కాంబినేషన్ ఓ మూవీ రాబోతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా పూజాకార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ రూమర్ నెట్టింట వైరల్ అవుతోంది. అదేంటంటే.. ఈ చిత్రంలో చిరు సరసన మరోసారి నయనతార నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. నయనతార తోపాటు ఇందులో బాలీవుడ్ నటి పరిణితి చోప్రా కూడా కీలక పాత్రలో నటిస్తారని సినీ వర్గాల టాక్. ఇప్పటికే నయనతార..చిరుకు జోడీగా సైరా సినిమా చేసిన విషయం తెలిసిందే. అయితే, అందులో సాంగ్స్ కు గానీ, రొమాన్స్ కు గానీ పెద్దగా స్కోప్ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహపడ్డారు. ఇక, గాడ్ ఫాదర్ లో చెల్లిగా నటించినా.. ఇద్దరి మధ్య డైలాగ్స్ లేవు. ఈ క్రమంలో అనిల్ తెరకెక్కించబోయే సినిమాలో చిరు, నయన్ కలిసి నటిస్తే.. ఫ్యాన్స్ కు పండగనే చెప్పాలి. ఈ సినిమా కామెడీ, మాస్ ఎంటర్ టైనర్ గా రూపొందనుంది. ఇందులో అనిల్.. వింటేజ్ మెగాస్టార్ ను చూపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో చిరు-నయన్ మధ్య రోమాన్స్, సాంగ్స్ చూసి అభిమానులు ఎంజాయ్ చేసే అవకాశం ఉంది. కాగా, ఈ మూవీ షూటింగ్ త్వరలోనే ప్రారంభించనున్నారు. టాలీవుడ్ లో వరుస విజయాలు అందుకున్న దర్శకులో అనిల్ రావిపూడి ఒకరు. రీసెంట్ గా 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. . ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి కోసం ఓ స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారు. ఇప్పటికే వీరి మధ్య కథా చర్చలు కూడా పూర్తయ్యాయి. వైజాగ్ లో అనిల్ రావిపూడి తన టీమ్ తో కలిసి స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమా కథ గురించి మాట్లాడుకుంటే.. ఇది పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని, ఈ మూవీ షూటింగ్ కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను అని, ఇంతకు ముందు చిరంజీవి పలు ఇంటర్వ్యూలలో ఇప్పటికే చెప్పేశారు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కి సిస్టర్ రోల్ ఉందని..ఈ పాత్రలో సీనియర్ హీరోయిన్ జ్యోతిక నటించబోతుందని టాక్ నడుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో తెలియదు, కానీ ఈ న్యూస్ వైరల్ అవుతుంది. ఇంతకు ముందు చిరు ఇంకా జ్యోతిక 'ఠాగూర్' మూవీలో జంటగా నటించారు. అప్పట్లో ఈ జోడికి మంచి మార్కులు కూడా పడ్డాయి. ఇక ప్రజంట్ జ్యోతిక కూడా ఫుల్ ఫామ్‌లో ఉంది.. వరుస సినిమాలు అలాగే పలు హిందీ సిరీస్‌లో కూడా నటిస్తోంది.

# అమెరికాలో కన్నప్ప ప్రచారం

**• మే 8వ తేదీ నుంచి వరుస ప్రచార కార్యక్రమాలు**

మంచు విష్ణు కీలక పాత్రలో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప' ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహించారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పనులు పూర్తిచేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈక్రమంలో మంచు విష్ణు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గత కొన్నేళ్లుగా తెలుగు సినిమాలకు అమెరికాలో మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో అక్కడి మార్కెట్‌పైనా దృష్టిపెట్టారు. ఇందులోభాగంగానే 'కన్నప్ప' మూవీకి సంబంధించి పలు ఈవెంట్‌లను ప్లాన్ చేశారు. మే 8వ తేదీ నుంచి వరుసగా ప్రచార కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే రోడ్‌షోలను కూడా నిర్వహిస్తున్నారు. న్యూజెర్సీ ఇందుకు వేదిక కానుంది. డల్లాస్, లాస్ ఏంజిల్స్ సహా అమెరికాలోని పలు ప్రాంతాల్లో 'కన్నప్ప'ను ప్రచారం చేయనున్నారు. 'కన్నప్ప' ప్రచారం విషయంలో మంచు విష్ణు మంచి ప్లానింగ్‌తో ముందుకువెళ్తున్నారు. మే నెల మొదటి 15 రోజుల్లో అమెరికాలో ప్రచారం పూర్తి చేసి, తిరిగి వచ్చిన తర్వాత భారత్‌లో అందుకు సంబంధించిన ఈవెంట్‌లను నిర్వహించనున్నారు. జూన్ 27న విడుదల నేపథ్యంలో నెల రోజుల పాటు వివిధ నగరాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అమెరికా పర్యటన పూర్తయిన తర్వాత దీనికి సంబంధించిన షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ ప్రచారంలో సినిమాలో కీలకపాత్రలు పోషించిన నటీనటులు కూడా పాల్గొననున్నారు. మోహన్‌బాబు, శరత్‌కుమార్, ముకేశ్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్, అక్షయ్‌కుమార్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ మూవీకి విష్ణునే కథ, స్క్రీన్‌ప్లే అందించారు. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తీర్చిదిద్దారు.



# బెల్లంకొండ మూవీ కిష్కింధపురి



బెల్లంకొండ సాయి శ్రీనివాస్.. ప్రజంట్ వరుస సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో 'భైరవం' ఇంకా 'టైసన్ నాయుడు' చిత్రాల షూటింగ్ దాదాపు ఫినిషింగ్‌కి రాగా. ఇక ఈ సినిమాలు కాకుండా సాయి శ్రీనివాస్ కెరీర్ తన 11వ సినిమా కూడా రాబోతుంది. దర్శకుడు కౌశిక్ పగళ్ళపాటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంతో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక గ్రిప్పింగ్ హర్రర్-మిస్టరీ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా గురించి..తాజాగా మేకర్స్ ఇప్పుడు అఫీషియల్‌గా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కి 'కిష్కింధపురి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయగా, ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ఎక్సయిటింగ్ ఎక్స్ ప్రెషన్స్‌తో కనిపిస్తున్నారు. చేతుల్లో జ్వాలలు పట్టుకుని, బెల్లంకొండ శ్రీనివాస్ , అనుపమ ఇద్దరు అడవిలో ఏదో వెతుకుతున్నట్లు కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో ఒక బంగ్లా కనిపింయడం థ్రిల్లింగ్ వైబ్‌ని తిసుకొచ్చింది. మొత్తానికి టైటిల్, పోస్టర్ రెండూ మూవీ పై అంచనాలు పెంచగా, ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఏప్రిల్ 29న సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు.

# పెళ్లెప్పుడు...త్వరలోనే చేసుకుంటా...

**• నటుడు విశ్వక్‌సేన్ మనసులో మాట**



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు.లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హాజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. 'అర్జున్ సర్కార్, విక్రమ్‌లో లేని క్వాలిటీ ఏంటి అని మీరు అనుకుంటున్నారు.' అన్న ప్రశ్నకు విశ్వక్.. 'ఫిట్టింగ్ ఇది. ఇద్దరిలో ఉండే ప్రశాంతత. కామ్ నెస్ అంటూ సమాధానం ఇచ్చారు. ఇక మీరు పెళ్ళెప్పుడు చేసుకోవాలనుకుంటున్నారు?' అని సుమ అడగ్గా.. మా అమ్మకు సంబంధాలు చూడమని మొన్ననే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాను. సో.. ఎప్పుడు దొరికితే అప్పుడు చేసుకుంటాను అని విశ్వక్ చెప్పడంతో త్వరలో మనోడు కూడా పప్పు అన్నం పెట్టించబోతున్నాడని ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ విభూషణ్ అవార్డ్ అందుకున్న బాలయ్య



2025 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం (ఏప్రిల్ 28) ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సినిమా రంగానికి గాను విశేష సేవలు అందించిన ప్రముఖులకి ప్రతిష్టాత్మక అవార్డులు అందించారు. ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ 'పద్మభూషణ్' అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా బాలయ్య పద్మ అవార్డుల కార్యక్రమానికి హాజరయ్యారు. కొడుకు, కూతుళ్లు, అల్లుళ్లతో కలిసి బాలయ్య ఈ కార్యక్రమానికి హాజరు కావడం విశేషం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైన బాలయ్య, రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారాన్ని స్వీకరించారు. 110కి పైగా చిత్రాల్లో నటించడంతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్‌గా కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో బాలయ్యకి ఈ అవార్డ్ దక్కింది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి కుమారుడు మోక్షజ్ఞ, కూతురు తేజస్విని, భార్య వసుంధర, మంత్రి నారా లోకేష్ దంపతులు హాజరయ్యారు.కోలీవుడ్ హీరో అజిత్‌కి సైతం పద్మ విభూషణ్ అవార్డ్ అందించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.పద్మ పురస్కారానికి ఎంపికైన సమయంలో అజిత్ భావోద్వేగానికి గురైన విషయం మనకు తెలిసిందే. ఈ శుభవార్తని వినేందుకు నా తండ్రి ఉండి ఉంటే బాగుండు అని అజిత్ కాస్త ఎమోషనల్ అయ్యారు.సినీ రంగంలోనే కాకుండా రేసింగ్‌లోను అజిత్ కి ప్రావీణ్యం ఉంది. కాగా, జనవరి 25న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2025 పద్మ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తం 139 మంది ఈసారి అవార్డుల కోసం ఎంపికయ్యారు. వీరిలో 113 మందికి పద్మశ్రీ, 19 మందికి పద్మభూషణ్, ఏడుగురికి పద్మవిభూషణ్ పురస్కారాలు లభించాయి.



# సమంత శుభం ట్రైలర్ విడుదల

హీరోయిన్ సమంత నిర్మిస్తున్న తొలి మూవీ 'శుభం'. అంత కొత్తవారితో తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఇందులో మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ట్రైలర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు సమంత. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇందులో సామ్ కూడా కీ రోల్‌లో నటించారు. కామెడీ, హర్రర్ నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమా మే 9న విడుదల కానుంది.

